శ్రీధర్ రెడ్డి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

కల్వకుర్తి: మే 23: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎముక జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చిన్నంబావి మండలం లక్ష్మిపల్లికి చెందిన శ్రీధర్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనలేకనే హత్య చేశారన్నారు. హత్య వెనుక ఉన్న బడా రాజకీయ నాయకులతో పాటు హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. శ్రీధర్ రెడ్డి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విత్తన మేళా

బిజినేపల్లి/తాడూరు, మే 23: బిజినేపల్లి మండలం పాలెంలోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ మల్లారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేళాలో ఉలువ, కంది, వరి, మినుములు, పెసర్లు, ఆముద, తెల్ల, పచ్చజొన్న, సజ్జ, రాగి, కొర్రలు తదితర విత్తనాలు ప్రదర్శించనున్నటు పేర్కొన్నారు. రైతులు మేళాను సద్వినియోగం చేసుకొని తమకు అవసరమైన విత్తనాలు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. బిజినేపల్లి మండలం పాలెం ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న విత్తన మేళాను తాడూరు మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో శివ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మేళాలో వివిధ పంటల విత్తనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

వరి ఆర్ఎన్ఆర్ 15048 రకం విత్తనం 15 కిలోలు ధర రూ.50, కేఎన్ఎం 1638 రకం 20 కేజీలు రూ.48, తెల్ల జొన్న విశిష్ట 30 కేజీల ధర 108, ఇలా అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన

పెద్దకొత్తపల్లి, మే 23: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏఎన్ఎం ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైపవర్ టెన్షన్,డయాబెటీస్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్సీడీ ప్రోగ్రాంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనర్సింహగౌడ్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

బల్మూరు, మే 23 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తాసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మెన్‌పేట, కొండనాగుల గ్రామాల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన వడ్లను ఆయన పరిశీలించారు. సింగిల్‌విండో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప ర్ను, ఆర్ఐలు శివ, పద్మ ఉన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలి

లింగాల, మే 23 : జాతీయ ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచి వలస నివారణకు కృషి చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ సెగ్రికేషన్ షెడ్డులో ఎరువుల తయారీ, క్రిటోరియం, పల్లెప్రకృతి వనాలను శుభ్రంగా ఉంచడం, గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా చూడడం చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉపాధిహామీ పనుల్లో బీనామి పేర్లకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కర్ణా, ఏపీవో హిమామ్‌అలీ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

వంగూరు, మే 23: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజన్న, గ్రామ పెద్దలు యాదగిరిరావు, ప్రకాశ్‌రావు, జూలూరి శ్రీనువాసులు, వేణుగోపాల్,పాండు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా మదనగోపాలస్వామి రథోత్సవం

పెంట్లవెల్లి, మే 23 : మండలంలోని జటప్రోల్ గ్రామంలోని మదన గోపాల స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో జటప్రోల్ గ్రామం గోవింద నామ స్మరణతో మార్మోగింది. గ్రామ మాజీ సర్పంచ్ ఎస్‌కే ఖాజా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 35 అడుగుల నూతన రథాన్ని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రాజా ఆదిత్య లక్ష్మణ్‌రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేని సుధాకర్‌రావు, వైస్ ఎంపీపీ బీంరెడ్డి, మండల నాయకులు ఎస్‌కే ఖాజా, గోవింద్‌గౌడ్, నాగిరెడ్డి, నూర్‌పాషా, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

బావిలోపడి మహిళ మృతి

లింగాల, మే 23 : మండలంలోని అంబట్‌పల్లి గ్రామ శివారులో ఓ బావిలో మహిళ మృతదేహం లభ్యమైన ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై జగన్‌మోహన్ కథనం మేరకు అంబట్‌పల్లికి చెందిన పార్వతమ్మ(42)ను వనపర్తి జిల్లా రేవల్లి గ్రామానికి చెందిన ఆనంద్‌తో 20ఏండ్ల కిందట వివాహం జరిగింది. ఆమెకు సంతానం కలగకపోవడంతో భర్త మరో మహిళ భాగ్యలక్ష్మిని రెండో వివాహం చేసుకున్నాడు. ఐదేండ్ల కిందట భర్త చనిపోవడంతో ఇద్దరు భార్యలు తరుచుగా గొడవ పడుతుండేవారు. కాగా ఈనెల 4న ఆనంద్ రెండో భార్యతో గొడవపడిన పార్వతమ్మ అంబట్‌పల్లి పుట్టింటికి వచ్చింది. తనకు ఎవ్వరు లేరని ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులో యాపట్ల వెళ్లే మార్గంలో ఉన్న బావిలో పడి మృతి చెందింది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంతలో పడి..

పెద్దకొత్తపల్లి, మే 23: మండలలోని మారెడుమాన్‌దిన్నెలో గుంతలో పడి మహిళ మృతి చెందింది. ఎస్సై సతీశ్ వివరాల మేరకు మండలంలోని దేదినేనిపల్లికి చెందిన మంజుల(35) భర్తతో గొడవపడి రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి పోయింది. గురువారం మారెడుమాన్‌దిన్నె శివారులో ఫారెస్టు అధికారులు తవ్విన గుంతలో మహిళ శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మంజులగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి మాసయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- అదనపు కలెక్టర్ సీతారామారావు

చారకొండ, మే 23: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు వరి ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సీతారామారావు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం, మండలంలోని జూపల్లిలో రైతువేదికలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామికుమార్, తాసీల్దార్ కేసి ప్రమీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఆరుగాలం కష్టించి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చేటప్పుడు తాలు, గడ్డి పోసలు లేకుండా తేమశాతం ఉండే విధంగా తేవాలన్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చే రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయరాదని అధికారులకు సూచించారు. క్వింటా వరి ధాన్యాన్నికి ప్రభుత్వం రూ.2,203 గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ మహమ్మద్ నభీ, పీఏసీసీఎస్ సీఈవో వెంకటయ్య, భీమయ్యగౌడ్, యాదయ్య ఉన్నారు.

కోడేరులో..

కోడేరు, మే 23 : మండలంలోని నాగులపల్లి, ఎత్తం, కొండ్రావుపల్లి, నర్సాయపల్లి, మైలారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తాసీల్దార్ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుంటామని నిర్వాహకులకు సూచించారు. తాసీల్దార్ వెంట గిర్దావర్ జంబులయ్య తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, మే 23 : మండలంలోని కొండూరు, గోప్లాపురం, పెంట్లవెల్లి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తాసీల్దార్ హిమబిందు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించి, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శివన్నగౌడ్ ఉన్నారు.

చారకొండ : ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల, మే 23 : పీఏసీసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం స్థానిక తాసీల్దార్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. ఉప్పునుంతల, పెద్దాపూర్, మొల్గర కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల్లో కొనుగోలు చేయడం పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటి వరకు సింగిల్‌విండో ఆధ్వర్యంలో 880 మంది రైతుల నుంచి 58,516 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు సీఈవో రవీందర్‌రావు తెలిపారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, మే 23 : పెద్దకొత్తపల్లి మండలం తిర్మలాపూర్‌లో కొనసాగుతున్న వరి కొనుగోలుకేంద్రాన్ని గురువారం తాసీల్దార్ ఎండీ ఇబ్రహీం పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేశ్ ఉన్నారు.

ఉప్పునుంతలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్

పెంట్లవెల్లిలో పరిశీలిస్తున్న తాసీల్దార్ హిమబిందు

పెద్దకొత్తపల్లి : కొనుగోలుకేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 6,548 మంది విద్యార్థులు

నాగర్‌కర్నూల్, మే 23: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్‌బోర్డు నోడల్ అధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం నుంచి జూన్ 3వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షలకు జిల్లాలో మొత్తం 6,548 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇందులో 4,037 మంది మొదటి సంవత్సరం, 2,511 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందుకోసం జిల్లా పరిధిలో మొత్తం 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించామని తెలిపారు. విద్యార్థుల కోసం పరీక్ష సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు పాలిసెట్

- పరీక్ష రాయనున్న 2,365 మంది విద్యార్థులు
- జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

నాగర్‌కర్నూల్, మే 23: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న పాలిసెట్‌కు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కోఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమర్ సాజహాన్ సుల్తానా గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు కొనసాగే పరీక్షకు నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 2,365 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో 5 పరీక్షా కేంద్రాలు, బిజినేపల్లి మండలం పాలెం డిగ్రీ కళాశాలలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు పెన్ను, పెన్సిల్ తప్పనిసరిగా తీసుకొని నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

బుద్ధుడి బోధనలు శాంతికి చిహ్నాలు

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్‌టౌన్, మే 23: బుద్ధుడి బోధనలు శాంతికి చిహ్నాలని ఉమ్మడి రాష్ట్ర పట్వారీల సంఘం మాజీ అధ్యక్షుడు పెంటమరాజు ప్రసాద్‌రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన బుద్ధ గీత కావ్య వాల్ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ బుద్ధుడు గొప్ప సంఘ సంస్కర్త అని, ప్రేమ సమానత్వం, మనిషిని మనిషిగా చూడడం, అందరిని గౌరవించడం లాంటి తత్వబోధనలు చేశారన్నారు. ఎన్నో దేశాల్లో ఆయన బోధనలు ఆచరిస్తున్నారన్నారు. ఆయన ధర్మ బోధనలను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందాల్సిన అవసరం ఉందన్నారు. కవి వనపట్ల సుబ్బయ్య మహాసంకల్పంతో రచనలు చేస్తూ వనపట్ల గ్రామానికి రెండు రాష్ట్రాల్లో పేరు తెచ్చారన్నారు. ఆయన ఇంకా ముందుకు సాగేందుకు మనమందరం ప్రోత్స హించాలన్నారు. అనంతరం కవి సుబ్బయ్యను సింగిల్‌విండో చైర్మన్ బండారు శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కొండకింద మన్నెపురెడ్డి, డైరెక్టర్ దొడ్డ రాజవర్ధన్‌రెడ్డి చిత్తనూరు శ్రీనివాసులు, భూషపాగ రాములు, సుదర్శన్, నెలపొడుపు సాహిత్య వేదిక గౌరవాధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

వంగూరు, మే 23: మండలంలోని డిండిచింతపల్లిలో శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్ర వైద్య శిబిరం గురువారం కొనసాగింది. శిబిరాన్ని శంకర నేత్రాలయ సంస్థ అధ్యక్షుడు ఇందుర్తి బాలకిష్టారెడ్డి, రోడ్ల భవనాల శాఖ ఈఎన్‌సీ ఇందుర్తి గణపతిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా కొనసాగుతున్న శిబిరంలో సుమారు 510 మంది కి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో46 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి గురువారం 16 మందికి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అచ్చంపేటటౌన్, మే 23 : ఇంటర్ సప్లిమెంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమవుతున్నాయని అచ్చంపేట ప్రభుత్వ కోఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు జనరల్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. మొదటి సంవత్సర పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం పరీక్షా మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అచ్చంపేట పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ కోఎడ్యుకేషన్ కళాశాల, త్రివేణి జూనియర్ కళాశాల మూడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డికి శుభాకాంక్షలు

వెల్దండ, మే 23 : మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి గురువారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తొద్దు

కల్వకుర్తి రూరల్, మే 23: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపీవో దేవేందర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఆయన కల్వకుర్తి మండలం రఘుపతిపేట, లింగసానిపల్లి గ్రామాలను సందర్శించారు. రఘుపతిపేట గ్రామంలో బోరు మోటర్లు కాలిపోవడంతో నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తడంతో మోటర్లను వెంటనే మరమ్మతు చేయించాలని పంచాయతీ కార్యదర్శి వంశీకి సూచించారు. గ్రామంలో సేకరిస్తున్న చెత్తను తడి పొడి చెత్తగా విభజించి వాటి ద్వారా ఆదాయ మార్గాలను సృష్టించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సురేశ్‌గౌడ్ ఉన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు సన్మానం

భాస్కర్‌రావును సన్మానిస్తున్న ప్రతినిధులు

వెల్దండ, మే 23: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, వెల్దండ సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావును భారత పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గురువారం కోల్‌కత్తాలో జరిగిన భారత పౌల్ట్రీ ఫెడరేషన్ సమావేశంలో తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జూపల్లి భా స్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను భారత పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

కేబుల్ వైర్ల చోరీ

వంగూరు, మే 23: మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతుల కథనం మేరకు హైదరాబాద్, శ్రీశైలం ప్రధాన రహదారి వెంట ఉన్న సుమారు 20 నుంచి 30 మంది రైతులకు చెందిన వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు దేవేందర్‌రావు, రామస్వామి తెలిపారు.

హంతకులను శిక్షించాలి

కల్వకుర్తి, మే 23: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజకీయ కక్షలతో వ్యక్తులను భౌతికంగా అంతమొందించి పైచేయి సాధించాలనుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

అచ్చంపేటటౌన్/అచ్చంపేటరూరల్, మే 23 : కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపే విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని ఎంఈవో రామారావు అన్నారు. గురువారం అచ్చంపే ట మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) భవనంలో ఏర్పాటు చేసి న సమావేశంలో ఆయన మాట్లాడారు. అ చ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల మండలాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సం బంధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు మండల సమాఖ్య కు అప్పగించారని తెలిపారు. అనంతరం మండలంలోని ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో యూనిఫాం క్లాత్‌ను ఎస్‌హెచ్‌జీలకు అందజేశారు. జూన్ 10వ తేదీలోగా యూనిఫాం పాఠశాలలకు సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

అమ్రాబాద్‌లో..

అమ్రాబాద్, మే 23 : పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను సకాలంలో అందించాలని ఎంఈవో బాలకిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయం వద్ద డీపీఎం గోరటి లక్ష్మయ్య తో కలిసి యూనిఫాం క్లాత్‌ను టైలర్లకు పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రా మ సంఘం లీడర్ల సమక్షంలో టైలర్లు అగ్రిమెంట్ చేసుకోవాలని, 15రోజుల్లోనే కుట్టిన యూనిఫాంను విద్యార్థులకు అందించాలని తెలిపారు. అమ్రాబాద్ మండలంలో మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలల్లో 1,048 మంది బాలురు, 986 మంది బాలికలు ఉండగా, అదేవిధంగా పదర మండలంలో 21 పాఠశాలలు 550 మంది బాలురు, 589 మంది బాలికలకు యూనిఫాంలకు సంబంధించిన క్లాత్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం గ్రామాధ్యక్షురాలు మస్తనమ్మ, ఏపీఎంలు రాంరెడ్డి, ఈశ్వర్, టైలర్లు పాల్గొన్నారు.

యూనిఫాం క్లాత్‌ను అందజేస్తున్న అధికారులు

లింగాలలో..

లింగాల, మే 23 : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెం దిన విద్యార్థులకు యూని ఫాం కుట్టుటకు మండల మ హిళా సంఘాలకు తీర్మానం చేసినట్లు మండల విద్యాధికా రి చంద్రుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రుడు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గా నూ ప్రభుత్వం ఉచితంగా యూనిఫాంలు పంపిణీ చేయడానికి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 32 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.50 చొప్పున యూనిఫాం కుట్టడానికి మహిళా సంఘాల మహిళలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఏపీఎం బాలస్వామి, హెచ్ఎం పర్వతాలు, శంకర్, అపర్ణ పాల్గొన్నారు.

టైలర్లకు యూనిఫాం క్లాత్‌ను అందజేస్తున్న అధికారులు

లింగాల : క్లాత్ అందజేస్తున్న ఎంఈవో చంద్రుడు

వృద్ధురాలు ఆత్మహత్య

చంద్రమ్మ

ఊర్కొండ, మే 23: వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై వీరబాబు వివరాల ప్రకారం బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన మార్చర్ల చంద్రమ్మ(80)కు ఇద్దరు కూతుళ్లు ఓ కుమారుడు ఉన్నాడు. చిన్న చిన్న గొడవలతో కూతుళ్లు కొడుకుకు మాటలు లేవు. దీంతో చంద్రమ్మ అటు కొడుకుకూ కూతుళ్లకు ఎవ్వరికీ ఏమీ చెప్పలేక, ఆరోగ్యం సహకరించక పోవడంతో మనస్తాపంతో గురువారం తెల్లవారు జామున ఇంట్లో కిటికి గ్రిల్స్‌కు ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ఘాట్ రోడ్డులో బోల్తాపడిన ఆటో

అచ్చంపేటటౌన్/అచ్చంపేటరూరల్, మే 23 : ఆటో బోల్తా పడి పలువురికి స్వల్ప గాయాలైన ఘటన గురువారం మండలంలోని ఉమామహేశ్వరం ఘాట్ రోడ్డులో చోటు చేసుకున